శరవేగంగా నా సామిరంగ

సంక్రాంతిని వదలకూడదని గట్టిగా ఫిక్సయినట్టున్నారు నాగార్జున. శరవేగంగా 'నా సామిరంగ' షూటింగ్ పూర్తి చేసేపనిలో నిమగ్న మయ్యారాయన. ఓ వైపు బిగ్‌బాస్, మరోవైపు 'నా సామిరంగ'. సిక్స్‌టీ ప్లస్‌లో క్షణం తీరికలేకుండా బిజీబిజీగా గడుపుతున్నారు నాగ్. రవి తేజ 'ఈగల్', 'హను-మాన్', వెంకటేశ్ 'సైంధవ్' షూటింగ్‌లు పూర్తి చేసుకొని సంక్రాంతి విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఇంకోవైపు మహేశ్‌బాబు 'గుంటూరుకారం' సినిమాను కూడా డిసెంబర్ మూడో వారం నాటికి పూర్తి చేసేయాలనే కసితో పనిచేస్తున్నారు త్రివిక్రమ్. అందుకే రాత్రింబవళ్లూ షూటింగ్‌లో పాల్గొంటూ డిసెంబర్ తొలివారంలోనే టాకీ పూర్తి చేసేయాలనే పట్టుదలతో ఉన్నారు నాగార్జున. విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో నాగార్జున గతంలో చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచారచిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నది. నాగ్ రగ్గడ్ లుక్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నది. ఇందులో నాగ్ పాత్రలో విభిన్నమైన కోణాలుంటాయని మేకర్స్ చెబుతున్నారు. ఎం.ఎం.కీరవాణి ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.

దీపికా పదుకొణె

అలా చెప్పకోటానికి గర్వపడతా

'ముంబయ్‌లో అడుగుపెట్టినప్పుడు నాది చాలా చిన్నవయసు. నాకు ఆత్మాభిమానం ఎక్కువ. ఆధారపడి బతకడం ఇష్టం ఉండేదికాదు. అందుకే నా తిండి నేను సంపాదించుకోవాలని నిశ్చయించుకున్నాను. అనుకున్నట్టే కష్టపడ్డాను. ఆ రోజుల్లో నాకు ఓ రూమ్‌కూడా ఉండేదికాదు. చేతిలో బండెడు లగేజ్. అర్ధరాత్రుళ్లు దాకా పనిచేసి ఆ లగేజ్‌తోనే క్యాబ్‌లో నిద్రపోయేదాన్ని. అవన్నీ గుర్తొస్తే ఏదో తెలీని ఆనందం. సాధించాననే చిన్న గర్వం' అంటూ చెప్పుకొచ్చింది దీపికా పదుకొణె. ఇటీవల ఆమె ఓ ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను ప్రస్తావించింది. 'నాకు సినిమా అంటే పిచ్చి. హీరోయిన్ అవ్వడమే నా టార్గెట్. నాకు వేరే పనిరాదు. ఇండస్ట్రీలో వారసులదే రాజ్యం. నాకు గాడ్‌ఫాదర్స్ లేరు. నాకు నేనే బలం అనుకున్నాను. ఎప్పటికప్పుడు మానసికంగా నాకు నేను స్ట్రాంగ్ అవుతూ, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, తీరిక లేకుండా పనిచేస్తూ నాకునేను ఓ మార్గాన్ని ఏర్పరచుకున్నాను. నేను వర్క్‌హాలిక్ అని చెప్పకోటానికి గర్వపడతా' అని దీపిక చెప్పింది. ఇంకా తన భర్త రణ్‌వీర్ గురించి మాట్లాడుతూ 'ఇద్దరం బిజీ జీవితాలు గడుపుతున్నాం. కొన్నిసార్లు తను అర్ధరాత్రి ఇంటికొస్తాడు. నేను తెల్లవారు జామునే వెళ్లిపోవాలి. కలిసి బతకడానికి సమయం దొరకట్లేదు. అందుకే ఇకనుంచి మా ఇద్దరి కోసం ఓ షెడ్యూల్ పెట్టుకోవాలనుకుంటున్నాం' అని చెప్పుకొచ్చింది దీపిక.



రామ్‌చరణ్

ఆ వార్తల్లో నిజమెంతో!?

రామ్‌చరణ్ ప్రస్తుతం శంకర్ 'గేమ్ ఛేంజర్' సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. శంకర్ 'భారతీయుడు2' కారణంగా ఈ సినిమా విడుదల ఆలస్యమవుతుందని అభిమానుల్లో చర్చ నడుస్తున్నది. 'గేమ్ ఛేంజర్' సమ్మర్‌లో విడుదల చేయనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇదిలావుంటే.. రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన'ఫేం బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఇందులో కథానాయికగా ముందు మృణాళ్‌ఠాకూర్ పేరు వినపడింది. ఆ తర్వాత జాన్వికపూర్ పేరు వైన్లోకొచ్చింది. ఇప్పుడు వీళ్లిద్దరూ కాదు సాయిపల్లవి అని కొత్త వార్త మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. రూరల్ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామాలో కథానాయికగా సాయిపల్లవి అయితేనే కరెక్ట్‌గా ఉంటుందని బుచ్చిబాబు భావించాడట. సాయిపల్లవి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తున్నది. త్వరలోనే చిత్రీకరణ మొదలుకానున్న ఈ సినిమాలో విజయసేతుపతి కీలక భూమిక పోషిస్తున్నారు. మైత్రీమూవీమేకర్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ బానర్లపై నిర్మించనున్న ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీత దర్శకుడు.



నాగచైతన్య

మిస్టీరియస్ దూత..

సాగర్ ఓ సక్సెస్‌ఫుల్ జర్నలిస్ట్. ఊహించని సంఘటనలు, మిస్టీరియస్ మరణాలు, అతీంద్రియ సంఘటనలు తననీ తన కుటుంబాన్ని వేధిస్తుంటాయి. ఆ తర్వాత ఏమైంది? అనే ప్రశ్నకు సమాధానంగా రూపొందిన ఎనిమిది ఎపిసోడ్ల వెబ్ సీరీస్ 'దూత'. అక్కినేని నాగచైతన్య టైటిల్‌రోల్ పోషిస్తున్న ఈ సిరీస్‌లో పార్వతి తిరువోతు, ప్రియా భవాని శంకర్, ప్రాచీ దేశాయ్ ఇతర పాత్రధారులు. విక్రమ్ కె.కుమార్ దర్శకుడు. శరత్‌మరార్ నిర్మాత. డిసెంబర్ 1 నుంచి ఈ సిరీస్ ప్రసారం కానుంది. ఉత్కంఠను కలిగించే సూపర్ నేచురల్ థ్రిల్లర్ ఇదని, నాగచైతన్య, ప్రియా భవాని శంకర్, ప్రాచీ దేశాయ్ ప్రాణంపెట్టి చేశారని ప్రైమ్ వీడియో అపర్ణ పురోహిత్ అన్నారు. అంకితభావం, అవిశ్రాంత ప్రయత్నాల ఫలితం ఈ 'దూత' వెబ్‌సిరీస్ అని, విక్రమ్ కె.కుమార్ అద్భుతంగా తెరకెక్కించాడని, మంచి నటీనటులు, సాంకేతికనిపుణులు పనిచేసిన ఈ సిరీస్ తప్పక ఆదరణ పొందుతుందని నిర్మాత శరత్ మరార్ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మీకోలజ్ సైగలు, సంగీతం: ఇషాన్ చాబ్రా.

శివాని రాజశేఖర్

నాన్న సలహాలు పాటించా

'ఆర్టికల్ 15' సినిమాలో ట్రైబల్ అమ్మాయిగా నటించాను. ఇందులోనూ అదే తరహా పాత్ర కావడంతో దర్శకుడు తేజ నన్ను సంప్రదించారు. ఈ సినిమా కోసం శ్రీకాకుళం స్లాంగ్ నేర్చుకున్నాను.' అని శివాని రాజశేఖర్ అన్నారు. రాహుల్ విజయ్‌తో కలిసి ఆమె నటించిన చిత్రం 'కోటబొమ్మాళి పీఎస్'. శ్రీకాంత్, వరలక్ష్మి శరత్‌కుమార్ కీలకపాత్రధారులు. తేజా మార్ని దర్శకుడు. గీతాఆర్ట్స్2 పతాకంపై బన్నీ వాసు, విద్యా కొప్పినీడి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా శివానీ బుధవారం విలేకరులతో ముచ్చటించింది. 'ఇందులో నాది విలేజ్ కానిస్టేబుల్ పాత్ర. ఈ పాత్ర కోసం నాన్న కొన్ని సూచనలు చేశారు. మాతృక 'నాయట్టు'లో చేసినవారి ప్రభావం పడకుండా, నా స్టైల్‌లో నేను చేశాను.' అని చెప్పింది శివాని. సినిమా విడుదలకు ముందే 'లింగిడి' సాంగ్ మాకు మంచి గుర్తింపు తెచ్చిందని, ఈ పాట వల్లే 'కోటబొమ్మాళి'కి ఇంత బజ్ వచ్చిందని, ఈ సందర్భంగా సంగీత దర్శకుడు మిథున్ ముకుందన్‌కి థ్యాంక్స్ అని శివాని ఆనందం వ్యక్తం చేశారు.

పాయల్ రాజ్‌పుత్

ఇప్పటివరకూ రాని కథ

'సార్.. ఒక సినిమా ఇవ్వండి.. ఒక్కఛాన్స్ ప్లీజ్.. అంటూ అజయ్‌భూపతి వెంటపడ్డాను. చిన్న చిన్న పాత్రలకు నిన్ను తీసుకోలేనని, మంచి పాత్ర వస్తే తప్పకుండా ఫోన్‌చేస్తానని మాట ఇచ్చారు. నటిగా నా పొటెన్షియల్, నా ట్యాలెంట్ ఆయనకు బాగా తెలుసు. సరైన కథ దొరికింది. దానికి తగ్గట్టు మంచి పాత్ర కుదిరింది. వెంటనే నాకు ఫోన్ వచ్చింది. ఈ సినిమా నా కెరీర్‌కే పెద్ద టర్నింగ్ పాయింట్ అవుతుందని నమ్మకంతోవున్నాను' అని పాయల్ రాజ్‌పుత్ అన్నారు. ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'మంగళవారం'. అజ్మల్ అమీర్ కథానాయకుడు. అజయ్‌భూపతి దర్శకుడు. ఎం.సురేశ్‌వర్మ, స్వాతిరెడ్డి గునుపాటి నిర్మాతలు. ఈ నెల 17న పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా పాయల్ విలేకరులతో ముచ్చటించారు. 'ఇండియాలో ఇప్పటివరకూ ఇలాంటి కథ రాలేదు. నేను చేసిన శైలూ తరహా పాత్ర కూడా ఎవ్వరూ టచ్ చేయలేదు. కథపరంగా ఇది సున్నితమైన పాయింట్. నా పాత్రలో ఎన్నో ఎమోషన్స్ ఉంటాయ్. సినిమా చూశాక శైలూపై మీకు సింపతీ వస్తుంది' అని పాయల్ అన్నారు. నిజజీవితంలో అస్సలు సంబంధంలేని పాత్రను ఇందులో చేశానని, శైలు పాత్ర గెటప్‌కే రెండుగంటలు పట్టేదని, అలాగే ఆ పాత్ర నుంచి బయటకు రావడానికి ఎక్కువ సమయం పట్టేదని, పదిహేను రోజులపాటు పాత్ర నుంచి బయటకి రాలేకపోయానని పాయల్ చెప్పారు. రాజీపడని నిర్మాతలు, టాలెంటెడ్ టెక్నీషియన్స్ పనిచేసిన ఈ సినిమా తప్పకుండా ఘన విజయం సాధిస్తుందని ఈ సందర్భంగా ఆమె నమ్మకం వెలిబుచ్చారు.

వాస్తవ సంఘటనల ఆధారంగా

1989లో చిత్తూరుజిల్లా కుప్పం నేపథ్యంలో సాగే కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం 'హరోం హర'. సుధీర్‌బాబు, మాళవికశర్మ జంటగా, జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి.నాయుడు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర కథానాయిక మాళవికశర్మ ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. చీరలో అందంగా, సాంప్రదాయబద్ధంగా కార్తికేయుని సన్నిధిలో నిలబడివున్న మాళవికశర్మ స్టిల్ ఆకట్టుకునేలా ఉంది. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతున్నదని మేకర్స్ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: అరవింద్ విశ్వనాథన్.

ఉత్కంఠ రేకెత్తించే అథర్వ

సస్పెన్స్, క్రైమ్ జానర్‌లో తెరకెక్కిన చిత్రం 'అథర్వ'. కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా ప్రధానపాత్రధారులు. మహేశ్‌రెడ్డి దర్శకుడు. సుభాష్ నూతలపాటి నిర్మాత. డిసెంబర్ 1న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. అతిథులుగా విచ్చేసిన దర్శకుడు శశికుమార్ తిక్కా, హీరో చైతన్యరావులు సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. 'క్లూస్ డిపార్ట్‌మెంట్‌ని క్లుప్తంగా చూపించబోతున్నాం. ఉత్కంఠను రేకెత్తించే విధంగా కథ, కథనాలు సాగుతాయి. సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుందీ సినిమా' అని దర్శకుడు చెప్పాడు. ఇంకా చిత్రం యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

మారుతి, రుక్సర్ థిల్లాన్, హరీశ్‌శంకర్, మెహరీన్ తదితరులు

తల ఎత్తుకునే ఫలితం ఇస్తాం

విక్రాంత్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'స్పార్క్ లైఫ్'. మెహరీన్, రుక్సర్ థిల్లాన్ కథానాయికలు. డెఫ్ ఫ్రాగ్ ప్రొడక్షన్స్ పతాకంపై లీల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. దర్శకులు హరీశ్‌శంకర్, మారుతి, పీపుల్ మీడియా టీజీ విశ్వప్రసాద్ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి సినిమా ఘన విజయం సాధించాలని శుభాశీస్సులు అందించారు. 'జీవించడం వేరు. బతకడం వేరు. అందరూ బతుకుతారు. కొందరే జీవిస్తారు. నాకు జీవించాలని ఉంది. అందుకే ఈ సినిమా తీశాను. నన్ను నేను నమ్మి ఆత్మస్థైర్యంతో ఈ సినిమా చేశా. ఈ ఆరేళ్ల ప్రయాణంలో చాలా కష్టాలు పడ్డాను. తల ఎత్తుకునే ఫలితం ఇస్తానని నమ్ముతున్నాను. నటీనటుల పరంగానే కాదు, సాంకేతికంగా కూడా అద్భుతంగా ఉంటుందీ సినిమా' అని విక్రాంత్ అన్నారు. అందరూ ప్రాణం పెట్టి పనిచేశారని, కచ్చితంగా విజయం సాధిస్తామని నిర్మాత నమ్మకం వ్యక్తం చేశారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

మహేంద్రగిరి వారాహి

హీరో సుమంత్ కొత్త సినిమాకు 'మహేంద్రగిరి వారాహి' అనే పేరును ఖరారు చేశారు. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కాలిపు మధు, ఎం.సుబ్బారెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి జాగర్లపూడి సంతోశ్ దర్శకుడు. రాజశ్యామలా అమ్మవారి నిత్య ఉపాసకులు విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్రస్వామి సమక్షంలో ఈ సినిమా టైటిల్‌ని మేకర్స్ ప్రకటించారు. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం నేపథ్యంలో సాగే కథ ఇదని దర్శకుడు చెప్పారు. రాజశ్యామల అమ్మవారు కొలువుదీరిన ఆలయం విశాఖ శారదాపీఠంలోనే ఉన్నందుకు అమ్మవారి అనుగ్రహం కోసం ఇక్కడకు వచ్చామని నిర్మాతలు చెప్పారు. ఈ ఏడాది జూన్‌లో షూటింగ్ ప్రారంభించుకున్న ఈ చిత్రం అతి త్వరలోనే టాకీ పూర్తి చేసుకోనుందని ఈ సందర్భంగా వారు అన్నారు. మీనాక్షి ఇందులో కథానాయిక.

సుమంత్, స్వరూపానందేంద్రస్వామి